### పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలతో...

# మొదట కులకచర్లకే.. సాగునీరు

- రంగారెడ్డి జిల్లాలో ఉద్యమ నాయకుడితో కలిసి నడిచిన నాయకుడు కొప్పుల హరీశ్వర్ రెడ్డి
- మహేశ్‌రెడ్డిని గెలిపించండి గండీడ్, మహ్మదాబాద్‌లను వికారాబాద్ జిల్లాలోకి కలిపిస్తా..
- ప్రతి తండాలో సేవాలాల్ భవన్లు, పరిగిలో బంజారా భవన్..: నాది బాధ్యత
- కులకచర్లకు జూనియర్ కళాశాల, పరిగికి పాలిటెక్నిక్, ఐటీఐలు ఏర్పాటు
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



పరిగి, నవంబర్ 13: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో మొదట పరిగి నియోజకవర్గానికి చెందిన భూములకే సాగునీరు అందనున్నాయని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ, పురపాలక శాఖ మంత్రి కె.తారక రామారావు తెలిపారు. కులకచర్ల మండలంలోని భూములకు సాగునీరు ముందుగా అందుతుందని, నియోజకవర్గం మొత్తం సస్యశ్యామలం అవుతుందని చెప్పారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో ఇటీవలె మొదటి మోటార్ ప్రారంభించామని, కాంగ్రెస్ వాళ్లు దరిద్రులు అడ్డం రాకపోతే ఈ పాటికి కులకచర్లకు నీళ్లు వస్తుండెనని మంత్రి పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం పరిగి నియోజకవర్గంలోని కులకచర్లలో నిర్వహించిన రోడ్ షోలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, చేవెళ్ల పార్లమెంటు సభ్యులు డాక్టర్ రంజిత్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డిలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ భయపడేదేమీ లేదని, నీళ్లు బయల్దేరాయని, మొట్టమొదటగా పరిగి నియోజకవర్గంలో కులకచర్ల మండలానికే రాబోతున్నాయని మంత్రి వెల్లడించారు. రాబోయే సంవత్సరం కాలంలోనే కృష్ణా నీరు తెచ్చిచ్చే బాధ్యతను తాను, ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి తీసుకుంటామని తెలిపారు.

### కేసీఆర్ మొండోడు, అనుకున్నడంటే చేసి చూపిస్తడు..

'ఇక్కడొక కాంగ్రెసోడు మాట్లాడుతున్నాడంట దివానా గాడు నీళ్లు రాలే, నీళ్లు రాలే అంటున్నాడంట, మేమేదో ప్రాణహిత-చేవెళ్ల పెట్టినం, మీరు తీసేసింండ్రు అంటున్నాడంట, ఆ దివానా గాడికి చెప్పండి.. కావాలంటే.. ఆ హౌలగానికి బస్సు పెట్టి పంపిద్దాం, పంపు చాల్ అయ్యిందా? లేదా?, నీళ్లు ఎల్లినయా? లేవా?, ఆడికెల్లి బయలుదేరాయా? లేదా? చూసి రమ్మనుండ్రి!' అని మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డిని ఉద్దేశించి కేటీఆర్ వ్యాఖ్యానించారు. కేసీఆర్ మొండోడు, అనుకున్నడంటే బరాబర్ చేసి చూపిస్తారని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో అందరి కంటే ముందు వచ్చి కేసీఆర్‌తో నడిచిన వారు కొప్పుల హరీశ్వర్‌రెడ్డి అని, ఈ విషయాన్ని మరిచిపోరాదన్నారు. హరీశ్వర్‌రెడ్డి నాయకత్వంలో అందరం కలిసి పనిచేశామని చెప్పారు. హరీశ్వర్‌రెడ్డి మనతో లేరని, ఆయన ఆత్మ శాంతించాలంటే ఈసారి మహేశ్‌రెడ్డి అద్భుతమైన మెజారిటీతో గెలవాలన్నారు.

### వికారాబాద్‌లో మహ్మదాబాద్, గండీడ్‌లు

మహ్మదాబాద్, గండీడ్‌లను వికారాబాద్‌లో కలపాలని మహేశ్‌రెడ్డి అడిగారని, మహేశ్‌రెడ్డిని జబర్దస్త్ మెజారిటీతో గెలిపించండి వారం రోజులలో ఈ రెండు మండలాలను వికారాబాద్‌లో కలిపిస్తానని కేటీఆర్ హామీ ఇచ్చారు. కులకచర్ల మండలానికి జూనియర్ కాలేజీ కావాలంటే మహేశ్‌రెడ్డిని గెలిపించాలని, పరిగి మండలానికి పాలిటెక్నిక్, ఐటీఐ కావాలన్నారని, ఆ బాధ్యత తాను తీసుకుంటానని కేటీఆర్ తెలిపారు. ఈ పనులు కాంగ్రెసోడు చేయాలంటే ఢిల్లీకి పోవాలని, మనకు ఈ సిల్లీ ఫెలోస్ అవసరమా? అని కేటీఆర్ ప్రశ్నించారు. మొన్న ఓటుకు నోటు, నేడు సీటుకు రేటు, రేపు పరిగినంతా అమ్మేయడా? అని రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి కేటీఆర్ వ్యాఖ్యానించారు.

### కాంగ్రెస్‌కు ఓటేసి కర్ణాటక లెంపలేసుకుంటున్నది..

కాంగ్రెస్‌కు ఓటు వేసిన పాపానికి కర్ణాటక రైతులు చెంపలేసుకుంటున్నారని, కరెంటు రాక బాధపడుతున్నారని, మీ బంధువులుంటే ఫోన్ చేసి అడగండి, కర్ణాటకలో వ్యవసాయానికి 5 గంటల కరెంటు వస్తుందన్నారు. మా పరిగి, కులకచర్ల, గండీడ్, మహ్మదాబాద్, దోమ రైతన్నలు ఒకటే ఆలోచించుకోవాలని, కరెంటు కావాలా, కాంగ్రెస్ కావాలా ఆలోచించాలన్నారు. ఆనాడు అర్ధరాత్రి బాయికాడ పడుకున్న రోజులు, ఎరువులు, విత్తనాల కోసం చెప్పులు లైన్‌లో పెట్టిన రోజులు మళ్లీ కావాలా ఆలోచించుకోవాలన్నారు.

### తొమ్మిదిన్నరేళ్లలో కులం పేరుతో కుంపట్లు పెట్టలే...

తొమ్మిదిన్నరేళ్లలో కులం పేరుతో కుంపట్లు పెట్టలేదని, మతం పేరిట మంటలు పెట్టలేదని, ప్రాంతం పేరిట పంచాయతీలు పెట్టలేదని తెలిపారు. కేవలం అభివృద్ధి మా కులం, సంక్షేమం మా మతం అని చెప్పారు. 55 ఏళ్ల కాంగ్రెస్ పాలన తర్వాత ముస్లింలు, దళితులు ఇంకా పేదరికంలో ఉన్నారంటే కాంగ్రెస్ కారణమా? తొమ్మిదిన్నర ఏళ్ల పాలన చేసిన బీఆర్‌ఎస్ కారణమా? ఆలోచించాలన్నారు. 'ఆప్‌నే బార్ బార్ ఉన్‌కో మోకా దియా, ఉనోనే బార్ బార్ దోకానే దియా' అని కాంగ్రెస్‌ను ఉద్దేశించి పేర్కొన్నారు. మైనారిటీలను కాంగ్రెస్ ఓట్లు వేసే యంత్రంగానే చూసిందన్నారు. కులాలు, మతాలు, ప్రాంతాలు ఏవీ వద్దు, మన ప్రాంతాన్ని మంచిగా చేసుకుందామనుకున్నాం.. తొమ్మిదిన్నర ఏళ్లలో అదే చేశాం అని అన్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా గుంటెడు భూమి ఉన్న రైతైనా సరే ఆయన చనిపోతే వారం రోజులలోపు రూ.5 లక్షలు ఎల్ఐసీ ద్వారా ఇచ్చే ఒకే ఒక్క ముఖ్యమంత్రి కేసీఆర్ అని పేర్కొన్నారు.

### తండాలను పంచాయతీలుగా..

లంబాడాలు తమ తండాలో తమ రాజ్యం ఉండాలని కొట్లాడారని, వారి పోరాటాన్ని మన్నించి, గుర్తించి, గౌరవించి పరిగి నియోజకవర్గంలోనే 50 పైచిలుకు తండాలను గ్రామ పంచాయతీలుగా చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందన్నారు. గిరిజనుల రిజర్వేషన్లను 10 శాతానికి పెంచడం జరిగిందన్నారు. 3 వేల పైచిలుకు గూడాలను గ్రామ పంచాయతీలుగా చేయడంతో పాటు 30వేల పైచిలుకు గిరిజన బిడ్డలను ప్రజా ప్రతినిధులుగా చేసింది కేసీఆర్ ప్రభుత్వమేనని అన్నారు. పరిగి నియోజకవర్గంలోని ప్రతి తండాలో సేవాలాల్ భవన్ కట్టిచ్చే బాధ్యత తనదేనని కేటీఆర్ హామీ ఇచ్చారు. పరిగిలో రూ.2 కోట్లతో బంజారా భవన్ నిర్మాణం చేపడుతున్నారని, ప్రతి తండాలో సేవాలాల్ భవన్ నిర్మాణం చేపడతామన్నారు. పరిగి ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి కొప్పుల మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చెబుతున్న ఆరు గ్యారంటీలు, ఎన్నికల హామీలేనని, కర్ణాటకలో, దేశంలోని కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలలో అమలు చేయని కాంగ్రెస్ తెలంగాణలో చేయదన్నారు. ఏది చెప్పినా చేసేది ఒక్క సీఎం కేసీఆర్ అని తెలిపారు. రోడ్ షో సందర్భంగా చూపించిన ఉత్సాహాన్ని ఈ నెల 30వ తేదీన పోలింగ్ రోజు ఓటు రూపంలో వేసి గులాబి జెండా ఎగురవేయడంతో పాటు సీఎం కేసీఆర్‌ను హ్యాట్రిక్ ముఖ్యమంత్రిగా చేసుకుందామన్నారు. అంతకు ముందు హెలిపాడ్ వద్ద బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డిలు పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, పరిగి నియోజకవర్గం ఎన్నికల ఇన్‌చార్జి నాగేందర్ గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు కాసాని వీరేశ్, కొప్పుల అనిల్‌రెడ్డి, పరిగి నియోజకవర్గంలోని వివిధ మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మార్కెట్ కమిటీల చైర్మన్‌లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కోటి దీపోత్సవానికి ప్రత్యేక బస్సులు

సిటీబ్యూరో, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ) : నగరంలోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్న కోటి దీపోత్సవానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తూ ఆర్టీసీ గ్రేటర్ అధికారులు సోమవారం నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 14 నుంచి 27 వరకు జరిగే ఈ ఉత్సవానికి హాజరుకానున్న భక్తుల కోసం ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. అయితే, నగరంలోని దాదాపు 18 ప్రాంతాలకు చెందిన డిపోల నుంచి ఎన్టీఆర్ స్టేడియం వరకు ప్రత్యేక బస్సులు నడుపుతామని ఆర్టీసీ గ్రేటర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.వెంకటేశ్వర్లు తెలిపారు. బస్సులకు సంబంధించిన పూర్తి వివరాల కోసం కోటి బస్ స్టేషన్‌లో 9959226160, రేతిఫైల్ బస్ స్టేషన్‌లో 9959226154 ఫోన్ నంబర్లను సంప్రదించాలన్నారు.

## ముగిసిన చంద్రమోహన్ అంత్యక్రియలు

బంజారాహిల్స్, నవంబర్ 13: మూడురోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన ప్రముఖ సినీనటుడు చంద్రమోహన్ అంత్యక్రియలు సోమవారం మధ్యాహ్నం పంజాగుట్ట శ్మశాన వాటికలో పూర్తయ్యాయి. అంతకు ముందు ఫిలింనగర్‌లోని చంద్రమోహన్ నివాసానికి చేరుకున్న నటులు చిరంజీవి, వెంకటేష్, రాజశేఖర్, జీవిత, నిర్మాత ఆదిశేషగిరిరావు, మాదాల రవి తదితరులు చంద్రమోహన్ పార్థివ దేహానికి నివాళులర్పించారు. అనంతరం, పెద్ద సంఖ్యలో వచ్చిన అభిమానులు, బంధు మిత్రుల అశ్రునయనాల నడుమ చంద్రమోహన్ అంతిమ యాత్ర ప్రారంభమైంది. పంజాగుట్ట శ్మశాన వాటికలో చంద్రమోహన్ సోదరుడు దుర్గాప్రసాద్ అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

## ఆత్మ విశ్వాసంతో లక్ష్యాలను సాధించాలి

కిమ్స్ హాస్పిటల్స్ చైర్మన్, ఎండీ డాక్టర్ భాస్కర్ రావు



సిటీబ్యూరో, నవంబర్ 13(నమస్తే తెలంగాణ): విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో, పోటీతత్వాన్ని పెంపొందించుకొని తాము ఎంచుకున్న లక్ష్యం వైపు అడుగులు వేయాలని కిమ్స్ హాస్పిటల్స్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ప్రసిద్ధ డాక్టర్ భాస్కర్ రావు అన్నారు. బేగంపేటలోని సెస్ ఆడిటోరియంలో సోమవారం ఏర్పాటు చేసిన విజయ్ ఆర్ట్స్ అకాడమి 2023 అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా హాజరై చిన్నారులకు అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జీవితంలో ఒక లక్ష్యాన్ని ఎంచుకొని ఆ దిశగా అడుగులు వేయాలన్నారు. క్రమశిక్షణ అంకితభావంతో ప్రయత్నిస్తే లక్ష్యాన్ని చేరుకోవచ్చన్నారు. ప్రతి ఏడాది పాఠశాలలు, కళాశాల విద్యార్థులకు ఏర్పాటు చేసే పెయింటింగ్, కార్టూన్, వ్యాసరచన పోటీల్లో ఈ సారి కూడా హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన 20 వేల విద్యార్థులు పాల్గొన్నారని ఏపీ అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయ్ బాబు తెలిపారు. విద్యార్థులకు చిన్నతనం నుంచే కళలపై ఆసక్తి కలిగించే విధంగా ప్రోత్సహించాలన్నారు. తల్లిదండ్రులు పిల్లల ఆసక్తిని గుర్తించి ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారని చెప్పారు. సంగీత, చిత్ర దర్శకుడు ఆర్పీ పట్నాయక్ మాట్లాడుతూ, పిల్లలకు వివిధ కళల్లో పోటీలను నిర్వహిస్తున్నందుకు, కళలకు వారి జీవితం అంకితం చేసినందుకు విజయ్ ఆర్ట్స్ అకాడమి వ్యవవస్థాపకుడు, పొలిటికల్ కార్టూనిస్టు డాక్టర్ ద్యాప విజయ్ కుమార్‌తో పాటు నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.లక్ష్మినారాయణ మాట్లాడుతూ, నిత్యం అనేక సమస్యల వలయంలో చిక్కుకున్న మానవులకు మానసిక ప్రశాంతత, ఆనందాన్ని ఇచ్చేవి కళలు మాత్రమేనని పేర్కొన్నారు. చిన్నారులు తమ అద్భుతమైన చిత్రలేఖనం ద్వారా సమాజ హితానికి చైతన్యానికి పాటుపడాలని, కార్టూన్లు ప్రజా చైతన్యానికి నిదర్శనమని, అందుకే పత్రికల్లో ప్రజలు వార్తల కంటే ముందు కార్టూన్లు చూస్తారని పేర్కొన్నారు. తమ అద్భుత ప్రతిభతో గీసిన బొమ్మలు రాజకీయ, సామాజిక పరివర్తనకు గీటురాయి కావాలని ప్రతి చిత్రకారుడు కార్టూనిస్టు కోరుకోవాలని ప్రముఖ జర్నలిస్టు విజయ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ డాక్టర్ మామిడి హరికృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైద్యరంగంలో విశేష కృషికి గాను డాక్టర్ బొల్లినేని భాస్కర్ రావుకు విశిష్ట సేవా పురస్కారాన్ని ప్రదానం చేశారు.

## బాలరాజుపై దాడి.. ఎలక్షన్ అధికారికి ఫిర్యాదు

- ప్రేరేపించిన రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్
- ఓటమి భయంతో బీఆర్‌ఎస్ అభ్యర్థులపై దాడులు



మీడియా సమావేశంలో పాల్గొన్న లీగల్ సెల్ సభ్యులు

నాంపల్లి కోర్టులు, నవంబర్ 13(నమస్తే తెలంగాణ): అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజుపై కాంగ్రెస్ పార్టీకి చెందిన దుండగులు దాడికి పాల్పడటంపై రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్‌రాజ్‌ను తెలంగాణ రాష్ట్ర లీగల్ సెల్ సభ్యులు కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. దాడికి ప్రేరేపించిన పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డితో పాటు దాడికి పాల్పడిన వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలని, రేవంత్ కాంగ్రెస్ పార్టీ ప్రచారానికి అనర్హుడిగా ప్రకటించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఇటీవల దుబ్బాక అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డిపై కూడా కత్తితో దాడికి పాల్పడిన ఘటన మరవక ముందే మరో ఎమ్మెల్యే గువ్వలపై దాడి చేయడం అమానుషమన్నారు. ఓటమి భయంతో బీఆర్‌ఎస్ అభ్యర్థులపై దాడులకు కాంగ్రెస్ పార్టీకి చెందిన దుండగులను ప్రేరేపిస్తున్న పార్టీ అధినేత రేవంత్ రెడ్డిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. రాబోవు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీఆర్‌ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సోమ భరత్ కుమార్, స్పోక్స్ పర్సన్ దాసోజు శ్రవణ్ కుమార్, హైకోర్టు బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కళ్యాణ్ రావు చెంగల్వ, లీగల్ సెల్ సభ్యులు లలితారెడ్డి, జక్కుల లక్ష్మణ్ పాల్గొన్నారు.

## ఎస్సీఆర్ పరిధిలో నాలుగు ప్రత్యేక రైళ్లు

సిటీబ్యూరో, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ) : దక్షిణ మధ్య రైల్వే జోనల్ ఆధ్వర్యంలో తంబరమ్ నుంచి సత్రగాచి రైల్వే స్టేషన్ల మధ్య ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 14, 16, 21, 23 తేదీలలో ఈ ప్రత్యేక రైళ్లు నడుస్తాయన్నారు. ఈ స్టేషన్ల మధ్య అధిక సంఖ్యలో ప్రయాణికులు ఉండటం వల్ల ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు.